

సివిల్ డిఫెన్స్ వాలంటీర్లుగా నమోదు

శ్రీకాకుళం : యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా యువ భారత్ సివిల్ డిఫెన్స్ వాలంటీర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ వెంకట్ ఉజ్వల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ సింధూర్ తదనంతర అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో ఈ వాలంటీర్లు కీలకం కానున్నారని పేర్కొన్నారు. యువ పౌరులను శక్తివంతం చేయడానికి సమిష్టి ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే గుణమున్న యువత అవసరమని పేర్కొన్నారు. స్థానిక అధికారులకు అవసరమైన సహకారం అందించడానికి యువదళం అవసరమని, ఆసక్తి గల వారు https:// mybharat.gov.in పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.


ప్రజాభిప్రాయంతో పని లేదా?

- ఏకపక్షంగా కార్పొరేషన్ ఆస్తులు ప్రైవేట్‌పరం
- ఆస్తులు అమ్మి సంపద సృష్టి పనిలో ప్రభుత్వం
- యూజర్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారం
- పాలకవర్గం లేకపోవడంతో ఆడిందే ఆట, పాడిందే పాట

ఎన్నికలప్పుడు ప్రజల ఓట్లతో తప్ప, ఆ తర్వాత ప్రజల అభిప్రాయంతో పని లేనట్లుగా టిడిపి కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఆస్తులను ప్రైవేట్‌కు అప్పగించేందుకు సిద్ధం కావడమే ఇందుకు ఉదాహరణ. అర్బన్ ఛాలెంజింగ్ ఫండ్ (యుసిఎఫ్) పేరుతో కార్పొరేషన్లలో విలువైన స్థలాలు, మార్కెట్లతో పాటు పార్కులు, మురుగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్ వంటి పనులను పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ (పిపిపి) విధానంలో ప్రైవేట్‌కు ధారాదత్తం చేసే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినా, కనీసం ప్రజల్లో చర్చకు పెట్టకపోవడం పాలకుల నియంతృత్వానికి అద్దం పడుతోంది. ప్రజల ఉమ్మడి ఆస్తులపై నిర్ణయం తీసుకునే విషయంలో ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

యుసిఎఫ్ కింద శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం, పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్, బాపూజీ కళామందిరం, నగరంలోని ఐదు పార్కులతో పాటు మరో ఆరు చోట్ల ఉన్న కార్పొరేషన్ ఆస్తుల్లో ప్రైవేట్ వ్యక్తులు, ప్రైవేట్ సంస్థలకు 50 శాతం వాటా కల్పించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నిర్వహణ భారం, నిధులు లేవనే సాకుతో ప్రైవేట్‌కు అప్పగించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటివరకు వీటి ద్వారా సాధారణ రుసుములు, ఉచిత సేవలు పొందుతున్న ప్రజలపై రాబోయే రోజుల్లో యూజర్ ఛార్జీల పేరుతో భారం పడనుంది.



పన్నుల భారం మోసేందుకు ప్రజలు ఇక ఏమాత్రం సిద్ధంగా లేరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక పక్కన చెప్తూనే, మరోవైపు జనంపై భారం వేసేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజల ఉమ్మడి ఆస్తులను విక్రయించడం, ప్రైవేట్‌పరం చేయడమే ఒక విధానంగా మార్చుకున్న కూటమి ప్రభుత్వం, ప్రజలపై పడే భారాన్ని మాత్రం లెక్క చేయడం లేదు. స్థానిక సంస్థలకు గ్రాంట్లు ఇచ్చి కార్పొరేషన్ ఆస్తులను కాపాడాల్సిన పాలకులు, నిరర్థక ఆస్తుల పేరిట వీటిని ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెట్టేందుకు సిద్ధం కావడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిధుల సమీకరణకు ఆస్తులను ప్రైవేట్‌కు అప్పగించడాన్ని అంతా తప్పు పడుతున్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తే సంపద పెరుగుతుందే తప్ప, ఇటువంటి ఆస్తుల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయం ఏముంటుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పాలకవర్గం లేకపోవడంతో ఆడిందే ఆట, పాడిందే పాట

మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో ఏ చిన్న పనిచేయాలన్నా పాలకవర్గం అనుమతి తప్పనిసరి. వైసిపి, టిడిపి నేతల రాజకీయ క్రీడల ఫలితంగా శ్రీకాకుళం కార్పొరేషన్ 15 ఏళ్లుగా ఎన్నికలకు నోచుకోలేకపోయింది. దీంతో ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే గానీ జిల్లాకు చెందిన మంత్రి కనుసన్నల్లోనే అంతా చక్కబెడుతున్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో, ప్రభుత్వం తీసుకునే ఆస్తుల ప్రైవేటీకరణ నిర్ణయాలకు అడ్డే లేకుండా పోయింది. అసలు పాలకవర్గం లేని సమయంలో ప్రజలను ఆస్తులను అమ్మేయడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కూటమి నేతల ఆంతర్యమేమిటో?

శ్రీకాకుళం కార్పొరేషన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా విలువైన ఆస్తులను ప్రభుత్వం ప్రైవేట్‌కు అప్పగిస్తుండడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. నగరంలోని పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్‌ను కూలదోసి కొత్తగా కడతామంటూ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రకటించిన నాటి నుంచి వ్యాపారులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. ప్రైవేట్‌కు అప్పగిస్తారన్న వార్తలు వారిని మరింత కలవరపాటుకు గురిచేస్తున్నాయి. నిర్మాణ పనుల కోసం షాపులను ఖాళీ చేసిన తర్వాత తిరిగి తమకు అప్పగిస్తారా?, వారికి నచ్చిన వారికి ఇస్తారా అనే సందేహాలు వారిని వెంటాడుతున్నాయి. మార్కెట్‌ను నిర్మించి 12 ఏళ్లు కాకుండానే దాన్ని కూల్చివేసి కడతామని చెప్పడంలో ఆంతర్యమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఇప్పటివరకు సాధారణ రుసుములతో బాపూజీ కళామందిరంలో సదస్సులు, సమావేశాలు నిర్వహించుకుంటున్న నగర పౌరులు వాటి ధరలు పెరిగే అవకాశం ఉండడంతో ఆవేదన కనిపిస్తోంది. ఇప్పటివరకు పార్కుల్లోకి ఉచితంగా ప్రవేశించే అవకాశం ఉండగా, వాటికీ రుసుములు వసూలు చేస్తారన్న వార్త అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. కూటమి పెద్దలు, ప్రజాప్రతినిధులు మాత్రం ఈ ప్రైవేట్ తంతుకు తమవంతు సహకారం అందించేలా ఆయా తరగతులను ఒప్పించే పనిలో నిమగ్నమయ్యారు. కార్పొరేషన్ ఆస్తుల విక్రయంపై నేతల సమర్థన వెనుక అందరిలోనూ అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పనిలో పనిగా విలువైన ఆస్తులను తమ మనుషులకు అప్పగించేద్దామనుకుంటున్నారా?, ప్రైవేట్ వ్యక్తుల నుంచి ఏవైనా ఆర్థిక ప్రయోజనాలు ఆశిస్తున్నారా? ఇలా భిన్నరకాలుగా నగరంలో చర్చ సాగుతోంది.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ అనిత

అవగాహనతోనే డెంగీ నివారణ

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అవగాహనతోనే డెంగీ నివారణ సాధ్యమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిఎంహెచ్ఒ కార్యాలయం నుంచి శుక్రవారం నిర్వహించిన అవగాహనా ర్యాలీని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత జెండా ఊపి ప్రారంభించారు. అక్కడ్నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు సాగిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021 నుంచి డెంగీ కేసుల్లో హెచ్చుతగ్గులున్నా, ఇంతవరకు జిల్లాలో డెంగీ నిర్ధారిత మరణాలు నమోదు కాలేదన్నారు. 2021లో 117 కేసులు, 2022లో 89 కేసులు, 2023లో 54 కేసులు, 2024లో 67 కేసులు నమోదు కాగా, ఈ ఏడాదిలో ఇంతవరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు.

జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి డెంగీకి సంబంధించి నిర్ధారణ (ఎలీషా) పరీక్షల కోసం పంపిన రక్త సీరం నమూనాలు శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి, టెక్కలిలోని జిల్లా కేంద్రాస్పత్రిలో మాత్రమే పరీక్షలు చేస్తారని చెప్పారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత మాట్లాడుతూ ఏడిస్ దోమకాటు వల్ల డెంగీ సోకుతుందన్నారు. కండరాలు, కీళ్లనొప్పులతో కూడిన జ్వరం, కళ్లు కదపలేని స్థితిలో కళ్ల నొప్పి వంటి సమస్యలు ఉత్పన్నమై శరీరంపై చిన్నపాటి దద్దుర్లు వస్తాయన్నారు. చిగుర్లు, ముక్కు, మలం ద్వారా రక్తం పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. డెంగీకి ఎలాంటి ప్రత్యేకమైన మందులు లేవని, లక్షణాల ఆధారంగా చికిత్స ఉంటుందన్నారు. యాంటీ మలేరియా మందులు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఉప కేంద్రాల్లో నిల్వ ఉన్నాయని తెలిపారు. గ్రామ పంచాయతీల సహకారంతో 62 హైరిస్క్ గ్రామాల్లో ఎనిమిది రౌండ్లు ఏంటీ లార్వాలు ఆపరేషన్స్ చేయించనున్నట్లు చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి పి.వి సత్యనారాయణ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు చైతన్య, సత్యనారాయణ, వాకర్స్ ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ ఎస్.జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిశుమరణాల నివారణకు చర్యలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శిశు మరణాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యారోగ్యశాఖ సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గత నాలుగు నెలల్లో 12 మంది శిశువులు మృతి చెందడంపై ఆయన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమదాలవలస మండలం బెలగాం, సారవకోట బొంతు, బూర్జ మండలం గుత్తావల్లి, శ్రీకాకుళం మండలం సింగుపురం, మెళియాపుట్టి, నందిగాం, నౌగాం, నౌపడ, తురకపేట, లింగాలవలస తదితర పిహెచ్‌సి పరిధిలో నమోదు కావడంపై కారణాలు తెలుసుకున్నారు. వైద్యారోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండి శిశు మరణాలను పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతల సంరక్షణకు చేపట్టాల్సిన జాగ్రత్తలను సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రాందాస్, ఇతర ప్రోగ్రాం అధికారులు, డిపిహెచ్ఎన్ఒ శైలజ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాఖ రీజియన్‌కు 20 ఫైర్ ఇంజిన్లు

అగ్నిమాపకశాఖ రీజనల్ అధికారి డి.నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి - పలాస



విశాఖ రీజియన్‌లో కొత్తగా 20 ఫైర్ ఇంజిన్లు మంజూరైనట్లు అగ్నిమాపకశాఖ రీజనల్ అధికారి డి.నిరంజన్ రెడ్డి తెలిపారు. కాశీబుగ్గ అగ్నిమాపక కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీజియన్‌లో 15 ఏళ్లు దాటిన ఫైర్ ఇంజిన్లతో పూర్తిస్థాయిలో సేవలందించ లేకపోతున్నామన్నారు. దీంతో కొత్తగా 20 ఫైర్ ఇంజిన్ల కొనుగోలుకు ప్రభుత్వానికి నివేదించగా, వాటిని మంజూరు చేసిందని చెప్పారు. 15 ఆర్థిక సంఘం నిధుల నుంచి ఒక్కో ఫైర్ ఇంజిన్ రూ.60 లక్షలు చొప్పున కొనుగోలు చేయనున్నామన్నారు. రీజియన్‌లో కొత్తగా ఆరు అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విజయనగరం జిల్లాలో నాతవలస, విశాఖలో ఎండాడ, సింహాచలం, కాపుల ఉప్పాడ, అరకు, చింతూరు, పాడేరు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వీటి నిర్మాణానికి రూ.రెండు కోట్లు చొప్పున నిధులు మంజూరైనట్లు తెలిపారు. 50 ఏళ్ల కిందట నిర్మాణం చేపట్టిన అగ్నిమాపక కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. అందులో సోంపేట, బొబ్బిలి, పాలకొండ, పార్వతీపురం, పాడేరు, రంపచోడవరం ఉన్నాయన్నారు. వీటి మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు చేస్తామన్నారు. ఆయన వెంట అగ్నిమాపకశాఖ అధికారి సోమేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

గస్తీ విధులు పటిష్టం

- పాత నేరస్తులపై నిఘా ఉంచాలి
- ప్రతిరోజూ గ్రామాల సందర్శన
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

రాత్రివేళలో గస్తీ విధులు పటిష్టం చేసి నేర నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి సూచించారు. టెక్కలి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ కేంద్రంలో రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి మహిళల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించి, వాటి దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు. రౌడీ షీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తులు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టేందుకు రాత్రి గస్తీ విధులను మరింత పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఎన్.బి.డబ్ల్యును త్వరగా అమలు చేయాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టిసారించి గ్రామస్తులతో మమేకమై ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు, గ్రామ సందర్శన, దత్తత కానిస్టేబుల్, మహిళా పోలీసుల సమన్వయంతో కట్టడి చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు నిరంతరం నిర్వహించాలని పలు అంశాలపై సిఐ విజయ్ కుమార్‌కు సూచనలు చేశారు.



సిఐకి సూచనలు చేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి



పాతపట్నం : జాతీయ జెండాతో ర్యాలీగా వెళ్తున్న నాయకులు, మాజీ సైనికులు

ఘనంగా తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం, పాతపట్నం

సైనిక బలగాలకు సంఘీభావం తెలుపుతూ కూటమి పార్టీల పిలుపు మేరకు శ్రీకాకుళం నగరంలో తిరంగా ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. నగరంలోని ఏడురోడ్ల కూడలిలో ఈ ర్యాలీని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ప్రారంభించారు. ఆయనతో పాటు శ్రీకాకుళం ఎమ్మెల్యే సతీమణి గొండు స్వాతి, జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ తదితరులు హాజరై దేశ సైనికులకు సంఘీభావం తెలిపారు. జాతీయ జెండాను చేతపట్టుకుని దేశభక్తిని పెంపొందించేలా సాగిన ఈ ర్యాలీలో కూటమి పార్టీల నాయకులతో పాటు మాజీ సైనికులు, పోలీసులు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం మానవహారం నిర్వహించారు.

పాతపట్నం : ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యాన పాతపట్నంలోని మాజీ సైనికులు, అధికారులు, కూటమి పార్టీల నాయకులతో టిడిపి కార్యాలయం నుంచి ఆల్ ఆంధ్రా రోడ్డు వరకు జాతీయ జెండాలతో వందేమాతరం, జైహింద్ అనే నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

స్వాభిమాన్ గ్రీవెన్స్‌కు 12 వినతులు

శ్రీకాకుళం : జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన పైడి గోవిందరావు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహిస్తున్న వికలాంగుల స్వాభిమాన్ ప్రత్యేక గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి కలెక్టర్ వినతులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా 12 మంది వికలాంగులు తమ సమస్యలపై వినతులు అందజేశారు. అంగవైకల్యంతో బాధపడుతున్నా సాంకేతిక కారణాలు చూపిస్తూ పెన్షన్ ఇవ్వడం లేదని గార మండలం వమ్మరవల్లికి చెందిన రాఘవులు ఫిర్యాదు చేశారు. తన పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో వికలాంగుల శాఖ ఎడి కె.కవిత, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, డిఎంహెచ్ఒ అనిత, డిసిహెచ్ఎస్ ఎన్.కళ్యాణ్‌బాబు, జిల్లా ఉపాధి అధికారి సుధ తదితరులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ స్థల ఆక్రమణ అడ్డగింత

ప్రజాశక్తి - పొందూరు

మేజర్ పంచాయతీ పొందూరు పరిధిలోని జోగెన్నపేట వద్ద గల ఎపిసిఎస్ స్థలంలో ఆక్రమణలను రెవెన్యూ, పోలీసు అధికారుల సహాయంతో పిఎసిఎస్ అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. జోగెన్నపేట వద్ద సర్వే నంబరు 408-8లో పిఎసిఎస్‌కు 22 సెంట్ల భూమి ఉంది. ఈ స్థలంలో 1984లో పిఎసిఎస్ భవన నిర్మాణం చేపట్టారు. కాలక్రమేణా ఈ భవనం శిథిలావస్థకు చేరుకుని వినియోగంలో లేకుండా పోయింది. అదే గ్రామానికి చెందిన కె.గోవింద్ ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించగా, 2023 జూన్ 5న పిఎసిఎస్ అధికారులు కలెక్టర్, ఎస్‌పి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి దాన్ని అడ్డుకున్నారు. మళ్లీ ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నించడంతో పిఎసిఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసు, రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే చేపట్టి సొసైటీకి ఉన్న 22 సెంట్ల స్థలానికి హద్దులు నిర్ణయించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్లు గణపతిరావు, ప్రసాదరావు, సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి చంటిబాబు, పిఎసిఎస్ ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, సిఇఒ వై.పాపినాయుడు, ఆడిటర్ జానకిరాం తదితరులు పాల్గొన్నారు.



పిఎసిఎస్ స్థలంలో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎంఎఎం, ఎఫ్ఎన్ఎస్ పథకం ద్వారా రైతులకు రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలా సాగుతోందని చెప్పారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో నిధులు జమ కానున్నాయని తెలిపారు. అనంతరం రైతులకు రోటోవేటర్, బ్యాటరీ, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు, దుక్కు నాగలి సెట్, వరి నూర్పు యంత్రం, కలుపు తీసే యంత్రం తదితర వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, వ్యవసాయ శాఖ జెడి కె.త్రినాథస్వామి, ఎడి బగ్గు రజని, ఎఒ మెట్ట మోహనరావు, టిడిపి నాయకులు పల్లి సురేష్, ఎస్.మురళి, అన్నెపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



యంత్ర పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్


రోడ్ల నిర్మాణంలో నిబంధనలు పాటించండి

సరుబుజ్జిలి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పల్లెకు మంజూరు చేస్తున్న సిసి రహదారుల నిర్మాణాల్లో నిబంధనలు పాటించి, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉండాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. అలికాం - బత్తిలి ప్రధాన రహదారి నుంచి కొత్తకోటకు ఉపాధి హామీ నిధులు రూ.147 లక్షలతో చేపట్టనున్న రహదారి నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు.

ముగ్గురు కార్మికుల అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలోని దీనబంధుపురంలో మౌనేష్‌రెడ్డి గ్రానైట్ క్వారీకి చెందిన ముగ్గురు కార్మికులు శుక్రవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందారు. టెక్కలి మండలం పోలవరానికి చెందిన బడబందుల అప్పన్న (42), తిర్లంగి రామారావు (40), తమిళనాడుకు చెందిన ఉంగవేణు ఆర్ముదం (45) మృతి చెందిన వారిలో ఉన్నారు. మృతుల శరీర భాగాలకు గాయాలు తగిలి ఉన్నాయి. క్వారీ యాజమాన్యం గ్రానైట్ క్వారీ నుంచి కొంత దూరంలో ట్రక్కులో మృతదేహాలను ఉంచడం, మృతులకు గాయాలు తగిలి ఉండడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న పాతపట్నం సిఐ రామారావు, మెళియాపుట్టి ఎస్ఐ పి.రమేష్‌బాబు క్లూస్ టీమ్‌తో ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్వారీలో బాంబు పేలుళ్ల కారణంగా, మరేదైనా కారణంతో మృతి చెందారా అని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.



ట్రక్కులో ఉన్న మృతదేహాలు

నాటికలు నవ చైతన్య దీపికలు

ప్రజాశక్తి - కవిటి

సమాజాన్ని మేల్కొలిపే నవ చైతన్య దీపికలు నాటికలు అని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. భైరిపురం కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన ఆరో అంతర్రాష్ట్ర ఆహ్వానిత నాటిక పోటీలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ ఒత్తిడికి తలొగ్గి లంచగొండిగా మారిన ఓ ఆదర్శ భావాలు కలిగిన ప్రభుత్వ ఉద్యోగి జీవితం ఇతివృత్తంగా సాగిన చీకటిపువ్వు, వ్యామోహంలో నుంచి పుట్టిన ప్రేమ కంటే కనిపెంచిన తల్లిదండ్రుల బంధం, బాధ్యతలు చాలా బలమైనవి చెప్పిన ఇంద్రప్రస్థం వంటి నాటకల ప్రదర్శన నేటి సమాజానికి అవసరమన్నారు. కళల కాణాచి అయిన ఉద్దానంలో మరిన్ని ప్రదర్శనలు ఏర్పాటు చేసి సామాజిక చైతన్యం కలిగించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రథమ స్థానం కైవసం చేసుకున్న ఇంద్రప్రస్థం, ద్వితీయ, తతీయ స్థానాలు పొందిన చీకటి పువ్వు, నాన్న నే వచ్చేస్తా నాటకాలకు విప్ అశోక్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు చేతుల మీదుగా బహుమతులు అందించారు.



బహుమతులు అందజేస్తున్న విప్ అశోక్

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

ఎస్‌పి మహేశ్వర రెడ్డి


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి

ప్రజాశక్తి- పలాస

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వచ్చే ప్రజా ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులను ఆదేశించారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను విని సానుకూలంగా స్పందించి, వారి సమస్యలపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. తక్షణమే ఆయా ఫిర్యాదుల చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి అందజేయాలని ఎస్‌పి సూచించారు.



మాట్లాడుతున్న సూరయ్య

జూలై 9న అఖిల భారత సమ్మె

ప్రజాశక్తి- కొత్తూరు

కార్మిక హక్కులు రక్షణ కోసం ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరగాల్సిన సార్వత్రిక సమ్మెను కేంద్ర కార్మిక సంఘాల జూలై తొమ్మిదో తేదీన చేపడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూరయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రస్తుత పరిస్థితులను కూలంకషంగా చర్చించి ఈనెల 20వ తేదీన చేపట్టాల్సిన సమ్మెను వాయిదా వేస్తున్నట్లు కేంద్ర కార్మిక సంఘాలు ప్రకటించాయని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తక్షణమే కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పి.రమేష్, ధనుంజయ, ఎస్.ధనలక్ష్మి, ఎస్.గౌరి, పి.జయలక్ష్మి, కళావతి, వెంకటమ్మ, డి.అప్పన్న, రాము తదితరులు పాల్గొన్నారు.


యుగంధర్‌ను పరామర్శిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

వడదెబ్బకు కానిస్టేబుల్ అస్వస్థత

పలాస: కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ యుగంధర్ విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం బందోబస్తు విధుల్లో ఉండగా ఉష్ణోగ్రత తీవ్రత (ఎండా తీవ్రత) కారణంగా వడదెబ్బకు అస్వస్థతకు గురయ్యారు. విషయాన్ని గమనించిన తోటి సిబ్బంది వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఈ క్రమంలో శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో గ్రీవెన్స్ నిర్వహిస్తున్న జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి విషయాన్ని తెలుసుకుని హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని హెడ్ కానిస్టేబుల్ యుగంధర్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వేడిని తట్టుకునేందుకు మంచినీరు, ఒఆర్ఎస్, పళ్లరసాలు వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, టోపి, కళ్ళకు కూలింగ్ కళ్లద్దాలు ధరించాలని, వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. వయసు ప్రాతిపదికన సిబ్బందికి విధుల్లో కొంత వెసులుబాటు కల్పించాలని సిఐ సూర్యనారాయణకు సూచించారు.

ఎపిఆర్‌జెసిలో మెరిసిన అభిజిత్

కవిటి: కవిటి మండలం ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జల్లు అభిజిత్ ఎపిఆర్‌జెసిలో 944వ ర్యాంకు, పాలీసెట్‌లో 1754వ ర్యాంకుతో సత్తా చాటినట్టు ఉపాధ్యాయులు తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన అభిజిత్ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు.

- బైలింగ్వల్‌లో బై(బిగ్) మిస్టేక్!
- ఉపాధ్యాయుల కేటాయింపుపై అసంతృప్తి
- పున: పరిశీలించాలంటున్న ఉపాధ్యాయులు

ఇలా అయితే ఎలా..?

ప్రజాశక్తి- కవిటి

బై లింగ్వల్ పాఠశాలైన కవిటి మండలం కుసుంపురం ప్రాథమిక పాఠశాలలో ఏప్రిల్ 30 నాటికి ఒక ఒడియా విద్యార్థి కూడా లేడు. మే 15వ తేదీకి అదే పరిస్థితి. ఉన్న విద్యార్థులందరూ తాము ఆంగ్ల (తెలుగు) మాధ్యమంలోనే చదువుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో కూడా ఇలాగే ఉంటామని తేల్చిచెప్పారు. దీంతో 80 మంది విద్యార్థులున్న ఆ పాఠశాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్కడ నాలుగు ఎస్.జి.టి పోస్టులు, ఒక హెచ్ఎం పోస్టు కేటాయించాలి. అయితే విచిత్రంగా అక్కడ మూడు పోస్టులు ఆంగ్ల భాషకు కేటాయిస్తూ, అసలు విద్యార్థులే లేని దగ్గర ఒక ఒడియా ఉపాధ్యాయ పోస్టు కేటాయించారు. దీంతో గత నెలరోజులుగా మీ పిల్లల్ని పాఠశాలలో చేర్పించండి మాది బాధ్యత అంటూ గ్రామంలో తిరిగిన ఉపాధ్యాయులు ఇప్పుడు తలలు పట్టుకున్నారు. ముగ్గురు ఉపాధ్యాయులతో పాఠాలు ఎలా చెప్పేదని, విద్యార్థులు లేని దగ్గర ఒడియా ఉపాధ్యాయుని పోస్టు ఎలా కేటాయించారని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే ఈ నిర్ణయంపై పున్ణ పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. ఐతే ఈ సమస్య కేవలం కుసుంపురం పాఠశాలకు మాత్రమే కాకుండా కవిటి, రాజపురం, మాణిక్య పురం వంటి బై లింగ్వల్ పాఠశాలలు ఉన్న అన్ని దగ్గర్లా జరిగినట్టు తెలుస్తోంది. కవిటి ప్రాథమిక పాఠశాలలో 105 మంది ఆంగ్ల విద్యార్థులకు కేవలం 3 ఎస్.జి.టి పోస్టులు కేటాయించి మోడల్ ప్రైమరీ పాఠశాలకు అవకాశం ఉన్న ఒడియా విద్యార్థులకు నాలుగు ఎస్.జి.టిలతో సరిపెట్టేశారు. వాస్తవానికి అక్కడ 120 మంది ఒడిశా విద్యార్థులు ఉన్నారు. కొత్త నిబంధనల ప్రకారం వారికి నాలుగు ఎస్.జి.టిలతో పాటు ఒక హెచ్.ఎం పోస్టు కేటాయించాలి. కానీ ఇక్కడ ఆంగ్ల, ఒడియా మాధ్యమాలకు ఓ హెచ్.ఎం పోస్టు కేటాయించారు. రాజపురం పాఠశాలది అదే పరిస్థితి. 20 మంది ఒరియా విద్యార్థులకు రెండు పోస్టులు కేటాయిస్తూ 99 మంది ఆంగ్ల విద్యార్థులకు కేవలం మూడు పోస్టులతో సరిపెట్టేశారు. ఇటువంటి పరిస్థితుల్లో విద్యార్థులకు తాము నాణ్యమైన విద్య ఎలా అందించాలని, ఏ ప్రాతిపదికన బై లింగ్వల్ పాఠశాలల్లో పోస్టులు మంజూరు చేశారని ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన

ప్రభుత్వ మోడల్ ప్రైమరీ పాఠశాలలో 45 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉండి మూడు తరగతి గదులుంటే ఒక ప్రైమరీ ప్రధానోపాధ్యాయుడు, నలుగురు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను మంజూరు చేస్తున్న తరుణంలో ఒరియా - ఆంగ్ల మాధ్యమాల్లో నడుస్తున్న బై లింగ్వల్ పాఠశాలల్లో మాత్రం రెండు వర్గాలను ఒకే కేటగిరిలో ఎలా పరిగణిస్తారని ఎపిటిఎఫ్ 1938 జిల్లా కార్యదర్శి శమళ్ల రాజబాబు ప్రశ్నించారు. కవిటి మోడల్ ప్రైమరీ పాఠశాల, రాజపురం మోడల్ ప్రైమరీ పాఠశాల, కుసుంపురం, మాణిక్యపురం మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ పోస్టుల కేటాయింపులో అసమానతలు కనిపిస్తున్నాయని, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి దీనిని సరిచేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్ ఫెడరేషన్ 1938 కవిటి మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బల్ల ధర్మారావు, గుడియా వంశీ, రాష్ట్ర జిల్లా ప్రతినిధులు మొర్రి గోపి, శమల్ల రాజబాబు, కొత్తపల్లి రంగారావు, శ్రీరామమూర్తి, బిసాయి తదితరులు కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



బై లింగ్వల్ పాఠశాల

డిఇఒకు మొర

దీంతో బై లింగ్వల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కేటాయింపులపై పున్ణ పరిశీలించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎపిటిఎఫ్ 1938 జిల్లా అధ్యక్షుడు బల్లెడ రవి, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు కోరారు. శ్రీకాకుళంలో డిఇఒ తిరుమల చైతన్యను కలిసి వినతిపత్రం అందించారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ధనుంజయరావు

ఉపాధి కూలీకి వడదెబ్బ

ప్రజాశక్తి- టెక్కలిరూరల్

మండలంలోని సీతాపురంలో చెరువులో ఉపాధి పనులు చేస్తున్న సీతాపురానికి చెందిన ధనుంజయరావు శుక్రవారం వడదెబ్బకు గురయ్యాడు. బాధితుడిని వెంటనే టెక్కలి ప్రాంతీయ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నాలుగు రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు.

మోడి టయోటా గ్రామీణ మహోత్సవం


గ్రామీణ మహోత్సవంలో స్వాతి

శ్రీకాకుళం: టొయోటా కార్లు అన్ని వర్గాల ప్రజలకు తక్కువ ధరకు అందిస్తూ, నాణ్యతలో మంచి ప్రమాణాలు పాటిస్తున్నాయని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి స్వాతి శంకర్ పేర్కొన్నారు. మండలంలోని ఎనబై అడుగుల జంక్షన్‌లో మోడీ టొయోటా గ్రామీణ మహోత్సవాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. కంపెనీ యాజమాన్యం తమ ఉత్పత్తులను వినియోగదార్లకు దగ్గర జేయడంతో పాటు వాహనాల సర్వీసింగ్, ఇతర ప్రమాణ సేవలు అందించాలన్నారు. టయోటా యాజమాన్యం కార్లు అమ్మకాల్లో తక్కువ బడ్జెట్ నుంచి హై బడ్జెట్ వరకు అందరికి అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మోడీ టయోటా వైస్ ప్రెసిడెంట్ పి.బి.ఆచారి మాట్లాడుతూ వాహనంపై సుమారుగా రూ.1.50 లక్షల తగ్గింపు ధర ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో పృథ్వి, సుదీర్, రవి, శివ, భాషా, సర్పంచ్ గుండ భాస్కర్, రఫీ పాల్గొన్నారు.


జగదీష్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

ఎపి సిసిబిఒఎ రాష్ట్ర అధ్యక్షులుగా జగదీష్

శ్రీకాకుళం ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎపిసిసిబిఒఎ) రాష్ట్ర అధ్యక్షులుగా ఎస్.వి జగదీష్ ఎన్నికయ్యారు. విజయవాడలో నిర్వహించిన అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికల్లో ఆయనను అంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎన్నికైన ఆయనను శుక్రవారం స్థానిక డిసిసిబి కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. నూతన కార్యవర్గంలో ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.వి సత్యనారాయణ, సలహాదారులుగా డి.వరప్రసాద్ ఎన్నుకోవడంపై ఎపిసిసిబిఇఎ యూనిట్ అభినందనలు తెలిపారు.

రేషన్‌కార్డులకు 125 దరఖాస్తులు

లావేరు: మండలంలో ఇప్పటివరకు కొత్తగా రేషన్‌కార్డులు మంజూరుకు 125 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ ఎం.రాజశేఖర్ చెప్పారు. శుక్రవారం మాట్లాడుతూ కొత్తరేషన్ కార్డులు మంజూరు, సభ్యుల చేర్పులు, మార్పులు, మృతి చెందిన వారి పేర్లు తొలగించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించమని ఆయా విఆర్ఒలకు ఆదేశించామన్నారు. ధరఖాస్తులు సచివాలయల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మండలంలోని వెంకటాపురం, రేగపాళెం, హనుమంతుపురం గ్రామాల్లో రీసర్వే ముమ్మరంగా జరుగుతుందని చెప్పారు.

'రుప్ప'కు మాతృ వియోగం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సానివాడ ఎంపిటిసి రుప్ప అప్పలసూరి తల్లి అప్పన్నమ్మ గురువారం స్వర్గస్తులయ్యారు. శుక్రవారం ఆమె అంత్యక్రియలకు గ్రామంలోని పెద్దఎత్తున జనం పాల్గొన్నారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైసిపి నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదేవిధంగా మనవరాలు రుప్ప దివ్య, జెడ్‌పిటిసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే శిరీష జన్మదిన వేడుకలు


కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష జన్మదిన వేడుకలు స్థానిక ఎమ్మెల్యే నివాసం, టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలాస నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వచ్చి ఆమెకు శుభాకాంక్షలు చెప్పగా జిల్లా నలుమూలల నుంచి టిడిపి నాయకులు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచి పెట్టగా, కాశీబుగ్గ సీతారామాలయం, కోసంగిపురం లలితా ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధులు, పేదలకు అన్నదానం చేపట్టారు. ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భారీగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఉదయం 6 గంటల నుంచి ఎమ్మెల్యే నివాసానికి నాయకులు చేరుకొని వేడుకలు మాదిరగా సంబరాలు జరిపారు. భారీ కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. సీనియర్ నాయకులు గాలి కృష్ణారావు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంచిపెట్టగా, లొడగల కామేశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేపట్టారు. కాశీబుగ్గ అన్న క్యాంటీన్‌లో ఉచితంగా భోజనాలు పెట్టగా ఆ కార్యక్రమంలో గౌతు శిరీషా భర్త, పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి స్వయంగా భోజనాలు వడ్డించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత మొదటిసారిగా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు జరుపుకోవడంతో పెద్దఎత్తున ప్రజలు, అధికారులు, నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ, ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తానని, నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ముందంజలో తీసుకు వెళ్తానన్నారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, సాసుమాన చంద్రమౌళి, కొండే నర్సింహులు, దడిలియాల నర్సింహులు, సవర రాంబాబు, బూరెల కృష్ణంరాజు, వంకల కూర్మరావు, కిక్కిర ఢిల్లీరావు, మల్లా శ్రీనివాసరావు, రుప్ప ప్రసాదరావు, ఢిల్లీ ప్రసాదరావు, కుప్పిలి కామరాజు, డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, మండలస్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే శిరీషా జన్మదినం సందర్భంగా ప్రజాశక్తి ప్రచురించిన స్పెషల్ ఎడిషన్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం ప్రజాశక్తి ప్రచురించిన కథనాలను ప్రత్యేకంగా చదివారు.



ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న గౌతు శిరీష

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

సోంపేట: కొర్లాం పంచాయతీ పరిధిలోని హుకుంపేట, బ్రాహ్మణ కొర్లాం, గోనకపాడు, లక్ష్మీపురం, నూకలూరు గ్రామాల్లో జలజీవన్ పథకం ద్వారా తాగునీటిని తక్షణమే అందించాలని సర్పంచ్ రవణమ్మ కోరారు. 15 రోజులుగా ఇంటింటి కొళాయిలకు నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోవారం రోజుల్లో గ్రామంలో సంబరాలు జరగనున్న నేపథ్యంలో తక్షణమే కొళాయిలకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

డిసిఎంకి వినతి

కవిటి: బ్రహ్మపూర్ నుంచి విశాఖపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు జాడుపూడి, బారువ రైల్వే స్టేషన్లలో నిలుపుదల చేయాలని జెడ్ఆర్‌యుసి మెంబర్ శ్రీనివాస రంగా రౌలో కోరారు. ఈ మేరకు ఆఫీస్ ఖుర్దా రోడ్‌లో ఉన్న డిఆర్ఎం కార్యాలయంలో డిసిఎం నాయక్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. అలాగే కొత్తగా మంజూరైన 12 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, 2 రోడ్ అండర్ బ్రిడ్జి పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. డిఆర్‌యుసిసి మెంబర్ కె.సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు


బూర్జ : ఈదురుగాలితో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. గత మూడు రోజులుగా ఎండ తీవ్రతకు ఉక్కిరిబిక్కిరైన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. ముఖ్యంగా 10 గంటల నుంచి సాయంత్రం వరకు వేడిని తట్టుకోలేకపోయిన ప్రజలు సాయంత్రాని వర్షం కురవడంతో సేద తీరారు. అయితే ఈదురు గాలులతో వర్షం కురవడంతో అరటి, మామిడి పంటలకు కొంతవరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

ఈదురుగాలులతో వర్షం

కొబ్బరి చెట్టుపై పిడుగు

మెళియాపుట్టి: కొబ్బరి చెట్టుపై పిడుగు పడి గ్రామస్తులు పరుగులు తీశారు. మండలంలో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన వర్షం కురిసిన నేపథ్యంలో పట్టుపురం పంచాయతీ పూలసారిలో కొబ్బరి చెట్టుపై పిడుగుపడి అక్కడ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. దగ్గర్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు ఉలిక్కిపడి అక్కడ నుంచి గ్రామానికి పరుగులు తీశారు. గ్రామంలో ఎవరికీ ఎటువంటి నష్టం కలగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం ప్రారంభించారు. గంగివలస కేజీబివిలో పెరుగుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని రూ.255.50 లక్షలతో అదనపు తరగతి గదుల పనులను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై కళాశాల యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుప్పిడిపేట ఆస్పత్రి ఆవరణలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ కేంద్రం ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలను పర్యవేక్షణ చేపట్టి రోగులకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రొనంకి కృష్ణంనాయుడు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మిరియాపల్లి వెంకటప్పల నాయుడు, మాజీ ఎఎంసి చైర్మన్ బైరి భాస్కరరావు, సీనియర్ నాయకులు సూరపు నారాయణ దాసు, డోల ప్రసాద్, పప్పల ధర్మారావు, నందుపల్లి దండాసి, జోగారావు, లబ్బా ధనలక్ష్మి, సర్పంచ్ అర్జల విష్ణు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


గుప్పిడిపేటలో బ్లాక్ హెల్త్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి


అప్పన్న, మల్లేశ్వరరావు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

కోటబొమ్మాళి: మండలం చలమయ్యపేట గ్రామ సమీపంలో జాతీయ రహదారిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చలమయ్యపేటకు చెందిన అంగ అప్పన్న (45), చెల్లూరి మల్లేశ్వరరావు (45) మృతి చెందారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు మృతులు కోటబొమ్మాళి నుంచి ద్విచక్ర వాహనంపై చలమయ్యపేటకు వెళ్తుండగా రోడ్డు దాటే క్రమంలో వేగంగా వెళ్తున్న కారు ఢీకొనడంతో అప్పన్న, మల్లేశ్వరరావులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని తొలుత టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మల్లేశ్వరరావు గురువారం రాత్రి మృతి చెందగా, మెరుగైన వైద్యం కోసం అప్పన్నకు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అప్పన్న శుక్రవారం మృతి చెందాడు. మల్లేశ్వరరావుకు భార్య పార్వతి, ఇద్దరు కుమారులు సాయి, శ్రీహరి ఉన్నారు. మృతుడు అప్పన్నకు భార్య లక్ష్మి, కుమారుడు మహేష్, కుమార్తె స్వాతిలు ఉన్నారు. దీనిపై స్థానిక ఎస్ఐ వి. సత్యన్నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కాగా ఈనెల 18 నుంచి చలమయ్యపేటలో మూడురోజులు పాటు జరగనున్న శ్రీపొలపోలమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాల కోసం గ్రామమంతా సిద్ధంగా ఉన్న తరుణంలో ఆలయ ధర్మకర్త అంగ అప్పన్న, గ్రామానికి చెందిన మల్లేశ్వరావులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. దీంతో ఏడాది పాటు ఈ ఉత్సవాలు గ్రామస్తులు వాయిదా వేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన రామినాయుడు

పాతపట్నం: మండలంలోని కమలమ్మ కొట్టు జంక్షన్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు పాతపట్నం నియోజకవర్గంలోని ఎల్ఎన్‌పేట మండలం రావిచంద్ర గ్రామానికి చెందిన చింత రామినాయుడు (65) మరొక ఇద్దరితో కలిసి ద్విచక్ర వాహనం వద్ద మాట్లాడుతుండగా గుర్తు తెలియని ఎర్టికా కారు ఆగి ఉన్న వారిని బలంగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా శుక్రవారం మధ్యాహ్నం చింత రామినాయుడు మృతి చెందాడు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.లావణ్య కేసునమోదు చేసి పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిపారు.


విలేకరులతో మాట్లాడుతున్న సిఐ అవతారం

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు


లావేరు: చోరీ కేసులో అదపాక గ్రామానికి చెందిన నిందితుడు పిన్నింటి చంద్రరావును అరెస్టు చేసినట్లు జెఆర్ పురం సిఐ ఎం.అవతారం శుక్రవారం లావేరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని పెద్దకొత్తకోటలో ఈనెల 3న ఇంటికి తాళం వేసి ఉన్న తాళాన్ని పగలగొట్టి ఇంటిలో భద్రపర్చిన రెండున్నర తులాల చైన్, చెవి దుద్దులు, ఇత్తడి సామగ్రిని చోరీ చేసి ఎత్తుకెళ్ళిపోయాడని, దానిపై బాధితులు యాగాటి లక్ష్మి ఈ నెల 5న పోలీసులకు పిర్యాదు చేయగా ఎస్ఐ జి.లక్ష్మణరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేసి ముగ్గురు నిందితులు చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. ఎ1 నిందితుడు పిన్నింటి చంద్రరావును శుక్రవారం పాతకుంకం వద్ద పట్టుకొని అదుపులోకి తీసుకొని చోరీకి గురైన బంగారం, ఇత్తడి సామగ్రిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తున్నామని చెప్పారు. మరో ఇద్దరు నిందితులను పట్టుకొనేందుకు గాలిస్తున్నామన్నారు. అలాగే చోరీ చేసిన బంగారాన్ని ముద్దాయి నుంచి తీసుకొని దాచిన ముద్దాయిల భార్యలు రాగోలు లలిత, పిన్నింటి రత్నమ్మలపైన కేసునమోదు చేసినట్లు సిఐ చెప్పారు. ఈ సందర్భంగా కేసు చేదనలో దర్యాప్తులో నిందితులను గుర్తించిన కానిస్టేబుల్ ఎం.ధర్మరావు, సిహెచ్ చక్రధర్, భాస్కరరావును సిఐ అభినందించారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ లక్ష్మణరావు, రైటర్ జోగారావు తదితరులున్నారు.

క్రైమ్ కార్నర్


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

ఇచ్ఛాపురం: కంచిలి గ్రామానికి చెందిన సుశాంత్ ప్రధాన్ బరంపురంలో బట్టలు షాపింగ్‌కు వెళ్తుండగా శుక్రవారం మధ్యాహ్నం ఇచ్చాపురం పాత టోల్‌ప్లాజా సేఫ్టీ రాడ్డును ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ ముకుంథరావు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం తన ఇంటి దగ్గర నుంచి బైక్‌పై బయలుదేరి బరంపురం వెళ్తుండగా మార్గమధ్యంలో బెల్లుపడ పాత టోల్‌ప్లాజా దగ్గరకు చేరేసరికి నేషనల్ హైవేపై తన బైకును స్పీడ్‌గా నడిపి రోడ్డు పక్కన ఉన్న సేఫ్టీ రాడ్లకు బైకును ఢీకొనడంతో బైక్‌తో సహా ఎగిరి పడడంతో తలకు గాయమైంది. హైవే అంబులెన్సులో చికిత్స నిమిత్తం ఇచ్చాపురం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం బరంపురం తరలించినట్లు టౌన్ ఎస్ఐ తెలిపారు. ఆయన భార్య భవాని ప్రధాన్ ఇచ్చిన ఫిర్యాదుపై టౌన్ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తాపడిన మినీ వ్యాన్

మినీ వ్యాన్ బోల్తా : ఏడుగురికి గాయాలు

కోటబొమ్మాళి: మండలం హరిశ్చంద్రపురం రైల్వేస్టేషన్ సమీపంలో జాతీయ రహదారిలో శుక్రవారం నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వెళ్తున్న లగేజ్ మినీ వ్యాన్ బోల్తా పడడంతో డ్రైవర్‌తో పాటు మరో ఆరుగురికి గాయలయ్యాయి. నరసన్నపేట నుంచి టెక్కలి మండలం భూరగాంకు లోడ్ నిమిత్తం వెళ్తూ ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టెక్ చేసే సందర్భంలో నరసన్నపేట మండలం దేసివానిపేటకు చెందిన వ్యాన్ డ్రైవర్ లిమ్మాడ ఉమ స్టీరింగ్ అదుపు చేయలేకపోవడంతో రోడ్డుకు ఎడమ వైపు బోల్తా పడింది. అందులో ఉన్న కూలీలు పట్ట లోకేష్, జీవన్, ప్రసన్న, చరణ్‌తో పాటు మరొకరికి చిన్న చిన్న గాయాలయ్యాయి. డ్రైవర్ ఉమకు కుడి తొడ, కుడి చేయి విరిగిపోయింది. వీరందరిని హైవే పెట్రోలింగ్ సిబ్బంది నరసన్నపేట గొలివి మోహన్ ఆస్పత్రికి తరలించారు.


బాధితులకు బియ్యం బస్తాలు అందజేస్తున్న సర్పంచ్, ఎస్ఐ

మురపాకలో నాలుగు ఇళ్లు దగ్ధం

లావేరు: మండలంలోని మురపాకలో శివాలయం వీధిలో శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో నాలుగు పూరిళు దగ్ధమయ్యాయి. బాధితులు, స్థానికుల కథనం మేరకు బాధితులంతా ఎప్పటిలాగే మధ్యాహ్నం ఉపాధి పనులకు వెళ్లిపోయారు. ముందుగా లావేటి లక్ష్మి ఇంటిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి అదే ఇల్లుని అనుకుని ఉన్న లావేటి రాములమ్మ, మామిడి ఈశ్వరరావు, గార రాములమ్మలకు చెందిన ఇళ్లకు మంటలు వ్యాపించాయి. లావేటి లక్ష్మి ఇళ్లు పూర్తిగా కాలిపోయింది. స్థానికులు మంటలు గుర్తించి వెంటనే బిందెలతో నీళ్లుపోసి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. గ్రామస్తులు సమాచారంతో లావేరు ఎస్ఐ జి.లక్ష్మణరావు శ్రీకాకుళం అగ్నిమాపక శకటం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామాన్లు, తిండి గింజలు, దుస్తులు, సామగ్రి కాలిపోయాయి. ఒక ఇళ్లు పూర్తిగా కాలిపోగా మరో మూడు ఇళు పాక్షికంగా కాలిపోయాయి. బాధితులంతా నిరుపేదలు కావడంతో తమకు తల దాచుకోవడానికి చోటు ఎక్కడని విలపించారు. ఈ ప్రమాదంలో సుమారు నాలుగు లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రమాద విషయం తెలుసుకున్న సర్పంచ్ ప్రతినిధి పెయ్యల లక్ష్మణరావు బాధితులకు బియ్యం బస్తాలతో పాటు నగదును అందజేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.


స్వాధీనం చేసుకున్న నాటుసారాతో ఎక్సైజ్ అధికారులు

70 లీటర్ల నాటుసారా స్వాధీనం

సోంపేట: మండలంలోని బకుడ గ్రామంలో సవర లక్ష్మి అనే మహిళ నుంచి 70 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, ఆమెను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆమెకు నాటుసారా సరఫరా చేసిన సవర దామోదరం అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో సిఐతో పాటు ఎస్ఐ సుజాత, సిబ్బంది విజయ్, గాలిబ్, రమణ, వెంకటేష్ పాల్గొన్నట్లు తెలిపారు. అలాగే సోంపేట ఇన్‌ఛార్జి సిఐ జి.వి రమణ, సిబ్బందితో కలిసి రాగుపురంలో చేసిన దాడుల్లో 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని నర్త హేమరాజును అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది మార్కారావు, భాను ప్రసాద్ పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం పోలీసు స్టేషన్ పరిధిలోని కొమరవానిపేట గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను జె.ఆర్.పురం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ ఎస్.చిరంజీవి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురుని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 12,400 నగదు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



దివ్యను అభినందిస్తున్న చైర్మన్ గోవిందరావు

దూరదర్శన్ నాట్య ప్రదర్శనలో దివ్యకు అవకాశం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురానికి చెందిన శ్రీ స్వేచ్ఛా నృత్య తరంగిణి కూచిపూడి, భరతనాట్యం, జానపద నాట్య శిక్షణాలయంలో నాట్య గురువు మంగి దివ్యకు దూరదర్శన్ బి హై గ్రేడింగ్ పోటీలకు అవకాశం లభించింది. దూరదర్శన్ యాదగిరి ఛానల్ హైదరాబాద్ వారు నిర్వహిస్తున్న పోటీలకు ముందుగా 2023లో పోటీల్లో పాల్గొని బి గ్రేడింగ్ ఆర్టిస్ట్‌గా గెలుపొందారు. 2024 దూరదర్శన్ ఆడిషన్స్‌కు ఏప్రిల్ నెలలో అప్లికేషన్స్ పంపించగా మే 16న ఆడిషన్స్ అధికారికంగా దూరదర్శన్ ప్రోగ్రాం డైరెక్టర్ వాట్సాప్ ద్వారా ఒక ప్రకటనలో తెలియజేశారు. శుక్రవారం దూరదర్శన్ యాదగిరి ఛానల్ పోటీలో పాల్గొన్న నాట్య గురువు మంగి దివ్య 14 నిమిషాలు నాట్య ప్రదర్శన నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి దూరదర్శన్ బి హై గ్రేడ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పత్రాన్ని అందజేయనున్నారని అకాడమి చైర్మన్ కె.గోవిందరావు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న దివ్యకు అకాడమి అధ్యక్షులు గోవిందరావు, కోశాధికారి మంగి దలమ్మ, విద్యార్థులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.


నూతన కార్యవర్గం

అభివృద్ధి కమిటీ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అక్కుపల్లి శ్రీరామ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ అభయాంజనేయ అభివృద్ధి కమిటీ కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా కె.ఎల్.నాయుడు, ఉపాధ్యక్షులు కాస వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి కాస ముకుందరావు, ఉప కార్యదర్శి బర్రి భూపతి, కోశాధికారి కాస సోమశేఖర్, కార్యనిర్వహణ సభ్యులుగా కాస ఈశ్వరరావు, సింగుపల్లి బాలకృష్ణ, గండుపల్లి మహేష్, మడ్డు వాసు, లండ మురళీ, అర్జాల జేజేరావు, మడ్డు లక్ష్మణరావు, సింగుపల్లి జగన్నాధం ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి శ్రీ రామా సేవా సంఘం అధ్యక్షులు మోస వరప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి అర్జాల ఈశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాస చలపతిరావు, మడ్డు మురళీ, మోస కుమార్, సూరాడ లోకనాథం, మడ్డు మాలయ్య, పిన్నాసి శ్రీకాంత్, జామి అనిల్ కుమార్ పాల్గొన్నారు.


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ దుర్గాప్రసాద్

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి- నరసన్నపేట

జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు నరసన్నపేట పట్టణంలో ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు నడిపేవారు లైసెన్స్‌లు, వాహనానికి సంబంధించిన పత్రాలు ఉండాలని లేనిచో అపరాధ రుసుంతో పాటు వాహనాన్ని సీజ్ చేయడం జరిగుతుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.


ఆర్థికసాయాన్ని అందజేస్తున్న సర్పంచ్ ప్రసాదరావు

యువకునికి ఆర్థికసాయం

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం పంచాయతీ తోవూరుకు చెందిన సవర రమేష్‌కు శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. రమేష్ ఇటీవల ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో గ్రామంలోని వైసిపి కార్యకర్తలు విరాళాలు సేకరించి రూ.6,600 ఆర్థికసాయాన్ని బాధితునికి శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, ఎస్. కళ్యాణ్, ఎస్.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌టిఆర్ అభిమానులను అభినందిస్తున్న స్వాతి

జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు

శ్రీకాకుళం: సినీ నటుడు జూనియర్ ఎన్‌టిఆర్ 42వ జన్మదినాన్ని ఆయన అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈవేడుకల్లో నగరంలోని కొత్తపేటలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి గొండు స్వాతి హాజరై ప్రారంభించారు. తంగి సత్యనారాయణ మల్టీస్పెషాలిటీ డెంటల్ క్లినిక్ వైద్యులు శిబిరంలో వైద్య పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ దుంగ శ్రీధర్, జిల్లా కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ అధ్యక్షులు బుర్రి మధు, టిడిపి నాయకులు గంగు నాగేశ్వరరావు, రమణ, జి.వాసు, గంగు రాజు, గోవిందరావు, శ్రీనివాసరావు, బొట్ట కామరాజు, విజయ్, శ్రీనివాస కార్తిక్, లక్ష్మణ్ రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

త్వరితగతిన అనుమతులకు చర్యలు

పలాస: భవన నిర్మాణ అనుమతులు త్వరితగతిన ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు కోరారు. శుక్రవారం ఆయన ఛాంబర్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో ఓపెన్‌ఫార్మ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటిలో అక్రమ కట్టడాలు గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటినిర్మాణం చేస్తున్న వారిని గుర్తించి వారితో నిర్మాణ అనుమతులు తీసుకోవాలని అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవడానికి సిద్ధమవ్వాలన్నారు.

గురుకులాలను చక్కదిద్దాలి


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న దళిత నాయకులు

ప్రజాశక్తి- టెక్కలి

జిల్లాలో ఉన్న అంబేద్కర్ గురుకులాలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని వాటిని చక్కదిద్దాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని దళిత సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం టెక్కలి అరుణ విద్యాలయంలో దళిత సంఘాల జెఎసి ఆధ్వర్యంలో అంబేద్కర్ గురుకులాల్లో మెరుగైన విద్యా సౌకర్యాల కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో దళిత విద్యార్థుల విద్యపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, పూర్తిగా విద్యావ్యవస్థను ధ్వంసం చేసిందన్నారు. గత ప్రభుత్వం దళిత విద్యార్థుల విద్యపై నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి కుంటుపడిందని, దానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం చక్కదిద్దాలన్నారు. గురుకులాల్లో పారామెడికల్ కోర్సులు ప్రవేశ పెట్టాలని, జిల్లాకు రెండు బాలుర, రెండు బాలికల డిగ్రీ కాలేజీలు స్థాపించాలని, విద్యార్థులకు కాస్మోటిక్స్ ఛార్జీలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం తక్షణమే శిథిలావస్థకు చేరుకున్న భవనాలు మరమతులు చేయించాలని డిమాండ్ చేశారు. మినరల్ వాటర్ ప్లాంట్‌లు గురుకులాల్లో ఉత్సవ విగ్రహాల్లా ఉన్నాయని, రూరల్ ప్రాంతాల్లో కొండ ప్రాంతంలో ఉన్న గురుకులాల్లో జనరేటర్ లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి సోలార్ పవర్ సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపీ, కులనిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, చల్లా రామారావు, మిస్కా కృష్ణయ్య, రాకోటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న శంకర్ రెడ్డి తదితరులు

పురవీధుల్లో కృతజ్ఞతా ర్యాలీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడిని తగ్గించేందుకు కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాలం అశోక్ చేసిన కృషికి గుర్తింపుగా శుక్రవారం టిడిపి బిసి సాధికారిత సమితి కన్వీనర్ కొండ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇచ్ఛాపురంలో గతంలో ఎన్నడూ లేని విధంగా తాగునీటి సమస్య జటిలమైంది. పట్టణంలో పలు ప్రాంతాల్లో బోర్లు, బావుల్లో నీటి నిల్వలు అడుగుంటాయి. కేవలం ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్నా ప్రజలకు నీరు అందక తీవ్ర ఇక్కట్లుకు గురవుతున్నారు. వైసిపి పాలకవర్గం పట్టించుకోక పోవడంతో తాగునీటి సమస్య ప్రభుత్వ విప్ దృష్టికి రావడంతో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకువచ్చారని కొండ శంకర్ రెడ్డి అన్నారు. దీంతో కేంద్ర మంత్రి స్వయంగా పట్టణంలో జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారని, ఈ నేపథ్యంలో వంశధార జలాలను ఇచ్ఛాపురం బాహుదా నీటి సరఫరాకు అనుసంధానం చేసి తాగునీటి సమస్య తాత్కలికంగా పరిష్కారానికి చొరవ చూపారన్నారు. తాగునీరు అందించడంపై స్థానిక బస్టాండ్ కూడలిలో కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆటోస్టాండ్ కార్మికులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి


రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్ల సంఘ సభ్యులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పెన్షనర్ల సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. శుక్రవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆవరణలో ఎమ్మెల్యే రవికుమార్‌ను పెన్షనర్ల సంఘసభ్యులు కలిశారు. గడచిన కొన్నేళ్లుగా పెన్షనర్ల సంఘం భవన నిర్మాణ స్థలం కోసం పలుమార్లు అధికారులను, నాయకులను కలిసి విన్నవించినప్పటికీ తమ సమస్య పరిష్కారం కాలేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సంఘ సమావేశాలు జరిగేటప్పుడు బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించుకోవాల్సిన దుస్థితి ఏర్పడు తుందని ఆయనకు వివరించారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే భవన నిర్మాణం కోసం స్థలం మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారని, తామంతా హర్షం వ్యక్తం చేస్తున్నామని పెన్షనర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఈ వినతిపత్రం అందించిన వారిలో కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ, విశ్రాంత తహశీల్దార్ జల్లేపల్లి రామారావు, సంఘ నాయకులు డి. లక్ష్మణరావు, ఆర్.సత్యనారాయణ, బి.వి.రమణ, బి.సూర్యనారాయణ, కె.షణ్ముఖరావు, పి. భానుజీరావు, డి.శ్రీరామమూర్తి, ఎన్.వాసుదేవరావు, జె.నరసింహారాజు, పి.ధనుంజయ రావు, బలివాడ వెంకటరమణ, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


కొత్తూరు : అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నవధాన్యాలపై అవగాహన

ప్రజాశక్తి- కొత్తూరు

మండల కేంద్రంలో సర్పంచ్ కృష్ణవేణి అధ్యక్షతన శుక్రవారం రైతులకు నవధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. రైతులందరితో వీధుల్లో ర్యాలీ చేశారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రతిభ సాధించిన ఆరుగురు ఆదర్శ రైతులకు సన్మానాలు చేశారు. వరిపంట ఎదలో ఎలా వేసుకోవాలి, వరి దమ్ములో ఎలా వేసుకోవాలో రైతులకు వివరించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, హెచ్ఎఒ హయంతి, విఎఎ దివాకర్, యూనిట్ ఇన్‌ఛార్జి చిన్నమ్మి, రవి, ఐసిఆర్‌పిలు రమణమ్మ, మాధవి, కోటేశ్వరి, విఒ గౌరీకళ తదితరులు పాల్గొన్నారు.

మందస: నవ ధాన్యాల సాగుతో నేల ఆరోగ్యం బాగుంటుందని వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలో చీపీ పంచాయతీ సచివాలయంలో సర్పంచ్ ప్రతినిధి చిరంజీవి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెంకట్రావు, నరేష్, ఈశ్వరరావు, వెలుగు సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎంసిఆర్‌పి సవర బాలకృష్ణ, ఐసిఆర్‌పిలు గంగమ్మ, సుహాసిని, లక్ష్మీనారాయణ, దీనబంధు, ప్రసాద్, సచివాలయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండలం కొంగరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి మన్మధరావు, ఐసిఆర్‌పి వెంకట పోలీస్ పాల్గొన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న గోపిన కృష్ణ ప్రసాద్, సర్పంచ్ గుండ రవి, నక్క తాతారావు రైతులను సన్మానం చేశారు.

విద్యుత్ సరఫరా నిలుపుదల

టెక్కలి రూరల్: మెళియాపుట్టి మండలం పరిధిలో 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రం మరమతులు, ఉపకేంద్రనికి విద్యుత్ సరఫరా అందించే పాతపట్నం నుంచి విద్యుత్ లైన్లు మరమతుల నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని డిఇఇ జి.శంకరరావు తెలిపారు. మెళియాపుట్టి, చాపర, పట్టుపురం, చీపురుపల్లి, కోసమల, వసుంధర, రట్టిని, పెద్ద పద్మాపురం, సుందరాడ, లింగుపురం, బంధపల్లి, వెంకటాపురం తదితర గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.


మాధవరావును పరామర్శిస్తున్న తమ్మినేని

మాజీ స్పీకర్ పరామర్శ

ప్రజాశక్తి- బూర్జ

మండలం తుడ్డలి గ్రామంలో వైసిపి నాయకులు మాధవరావు, సింగన్నపాలెం గ్రామంలో వైసిపి నాయకులు గేదెల ముఖలింగంను మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యం బారిన పడిన వారిని వారి నివాసంలో శుక్రవారం పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.


కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

పోలాకి: మండలం దండు లక్ష్మీపురంలో ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలనే దృక్పథంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ యూనిట్ కేంద్రాన్ని బగ్గు రమణమూర్తి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు మహిళా పక్షపాతి అని, ప్రతి రంగంలో మహిళలు ఆర్థికంగా ముందంజలో ఉండాలని మహిళలకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో బియ్యం కుంభకోణం

టిడిపి నాయకుడు జనార్ధనరావు

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వ హయాంలో నూతన రేషన్ కార్డుల మంజూరు జరుగుతుంటే గడచిన వైసిపి హయాంలో బియ్యం కుంభకోణం జరిగిందని రిటైర్డ్ తహశీల్దార్ కాళింగ సంఘ నేత, టిడిపి నాయకుడు పేడాడ జనార్ధనరావు అన్నారు. బుధవారం మండలంలోని శ్రీహరిపురంలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 8న ప్రభుత్వం కార్డుల మంజూరుకు అవసరమైన దరఖాస్తుల ప్రక్రియను చేపట్టడం జరిగిందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కొత్తరేషన్ కార్డులు, మార్పులు, చేర్పులు, విభజన, కార్డుల అప్పగింత, చిరునామా మార్పు, ఆధార్ అనుసంధానంలో జరిగిన తప్పుల సవరణ వంటి ఆరు ప్రధాన అంశాలతో కొత్తగా స్మార్ట్ కార్డుల జారీ కానున్నాయని అన్నారు. ఈకేవైసీ ద్వారా భౌతికంగా అన్ని డాక్యుమెంట్ల సమర్పణ లేకుండా ఆధార్ ఆధారంగా మ్యాపింగ్ పరిధిలో లబ్దిదారుల గుర్తింపు వంటి అంశాలు ఉంటాయని అన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూన అప్పలనాయుడు టిడిపి నాయకులు కిల్లి శేషు, చింతాడ బలరామ్ ప్రసాద్, సీపాన వెంకటరావు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు 127 దరఖాస్తులు

లావేరు: ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలకు ప్రభుత్వం ఇటీవల దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో మండలానికి 23 యూనిట్లు ప్రభుత్వం మంజూరు చేయగా 127 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సునీత తెలిపారు. వీటికి శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో బ్యాంకు అధికారులు, సచివాలయ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తుదారుల నుంచి వివరాలు నమోదు చేశారు. లావేరు ఎపిజివిబి మేనేజర్ నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

అతిపెద్ద సహకార బ్యాంకుగా 'ది విశాఖ కోఆపరేటివ్'


మాట్లాడుతున్న ప్రసాదరావు

ప్రజాశక్తి- పలాస

దేశంలోనే అతి పెద్ద సహకార బ్యాంకుగా ది విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ నిలిచిందని ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఎంసి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బ్రాంచ్ సభ్యుల మహాజన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార వ్యవస్థలో ది విసిబి బ్యాంక్‌కు ప్రత్యేకమైన గుర్తింపు లభించిందని, అంతర్జాతీయ సంస్థగా ఐక్యరాజ్యసమితి గుర్తించి ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు పాల్గొనాలని ఆహ్వానం వచ్చిందని, ఆయన సలహాలు సూచనలు తీసుకున్నారని గుర్తు చేశారు. బ్యాంకుకు ఖాతాదారులే పునాదులని పలాస బ్రాంచ్‌లో రూ.21 కోట్ల రుణాలు ఖాతాదారులకు అందజేశామని సక్రమంగా వాయిదాలు చెల్లించాలని కోరారు. డిప్యూటీ సిఇఒ గణేష్ మాట్లాడుతూ 2024 నాటికి 50 బ్రాంచ్‌లతో 4148.3 కోట్ల వ్యాపారం జరిగిందని రూ.26 కోట్ల ఆదాయం రావడంతో 4354 కోట్ల రూపాయలకు చేరుకుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ నరసింహమూర్తి, డైరెక్టర్ రామకృష్ణారావు, జోనల్ మేనేజర్ శ్రీనివాసరావు, పలాస బ్రాంచ్ మేనేజర్ జగదీష్‌తో పాటు బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

పన్ను బకాయిల వసూళ్లపై దృష్టి


మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగర ప్రజల నుంచి వివిధ రూపాల్లో చెల్లించాల్సిన పన్నుల బకాయిలను త్వరితగతిన వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ ఎస్‌డివివి ప్రసాదరావు ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో వార్డు అడ్మిన్ సెక్రటరీలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానంగా ఏళ్ల తరబడి పన్నులు చెల్లించని లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ప్రధానంగా వేకెంట్ ల్యాండ్ టాక్స్ చెల్లించకుండా ఎక్కువ మంది బకాయిదారులు పెండింగ్‌లో ఉన్నారని, అటువంటి వారి నుంచి పన్నుల వసూళ్లపై శ్రద్ధ చూపాలన్నారు. కుళాయి పన్నులు, భవన సముదాయాలకు చెందిన ప్రోపర్టీ టాక్స్, వ్యాపార సముదాయాలకు వివిధ రూపాల్లో వసూలు చేయాల్సిన బకాయిలపై దృష్టి పెట్టాలన్నారు. ఇప్పటివరకు లక్ష్యాలు సాధించడంలో ముందున్న సెక్రటరీలను ఆయన అభినందించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి ఉమామహేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కూలిన వంతెన


కూలిన వంతెన

ప్రజాశక్తి- నందిగాం

మండలం అనంతపురం సమీపంలో గల సైఫాన్ వంతెన కూలిపోయింది. శుక్రవారం ఉదయం మాతృనివలస నుంచి ఆనందపురం మీదుగా లారీలు వెళ్తుండగా అదే సమయంలో వంతెన ఒక్కసారిగా కూలింది. అయితే ఈ సంఘటనలో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. 1989లో నిర్మించిన ఈ సూపర్ పాస్ వంతెనకు కాలం చెల్లినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి తక్షణమే సైఫాన్ వంతెనను నిర్మించి వరద కాలువ నీరు చెరువులకు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

డ్రైనేజీపై పలకలు ఏర్పాటు చేయాలి


పలకలు లేని కాలువ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలోని 18వ వార్డు కొత్తవీధిలోని ప్రధాన రహదారిపై గల మురుగు కాలువపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ డ్రైనేజీపై ఉన్న పలకలు విరిగిపోయి చిన్నపిల్లలు మురుగు కాలువ దాటడానికి, వాహనాల రాకపోకలకు గత 15 రోజుల నుంచి వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు వాపోతున్నారు. ప్రధాన రహదారి వద్ద మురుగు కల్వర్టుపై పలకలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించినా పట్టించుకోలేదని అదే వార్డుకు చెందిన సీనియర్ న్యాయవాది బూర్ల సీతారాం విలేకరులకు తెలిపారు. చిన్నపిల్లలు కల్వర్టు దాటే సమయంలో ప్రమాదాలు జరగకముందే మున్సిపల్ అధికారులు స్పందించి కల్వర్టుపై పలకలు ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

యరకాచి చెరువును పట్టించుకునే వారేరి..?


మరమ్మతు పనులకు నోచుకోని యరకాచి చెరువు

కోటబొమ్మాళి: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో గల యరకాచి చెరువును పట్టించు కొనేవారే లేరా అని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత కొన్నేళ్ళుగా అధికారులు, ప్రజా ప్రతినిధులు యరకాచి చెరువుపై కన్నెత్తి చూడక పోవడంతో రోజురోజుకీ చెత్తాచెదారంతో అధ్వాన్నంగా తయారైంది. పదేళ్లుగా మరమ్మతు పనులు నిర్వహించక పోవడంతో చెరువు నుంచి దుర్గంధపు వాసన వస్తుండడంతో చెరువుకు స్నానానికి వచ్చేవారు రోగాల బారిన పడు తున్నారు. ముఖ్యంగా కోటబొమ్మాళి ప్రజలకు ఈ చెరువు ఎంతో అవసరమైంది. ఈ చెరువు వద్దనే కర్మకాండలతో పాటు పూజలు, వ్రతాలు చేస్తుంటారు. ఈ చెరువుకు అనుకొని అయ్యప్ప దేవాలయం, హనుమాన్ మందిరంతో పాటు కళ్యాణ మండలం, పంచాయతీ కార్యాలయం ఉండడంతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక ప్రాంతంగా పేరుగాంచింది. ఈ చెరువులో ఉన్న చెత్తాచెదారం తొలగించి, ఉపాధిహామీ సిబ్బంది ద్వారా పనులు నిర్వహించి చెరువుకు మరమ్మతు పనులు చేయాలని, ఆలాగే చెరవు గట్లుపై మొక్కలు నాటి, నిత్యం చెరువు నిండా నీరు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ బడులను పరిరక్షించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రతి గ్రామంలో ప్రతిపాదిత ఫౌండేషన్ స్కూల్ స్థానంలో 1 నుంచి 5 తరగతుల ప్రాథమిక పాఠశాల ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాలను కొనసాగించాలన్నారు. ఉర్దూ, ఒడియా వంటి మైనారిటీ భాషల మాధ్యమాలను కొనసాగించాలన్నారు. ప్రతిపాదిత మోడల్ స్కూళ్లకు పిఎస్ హెచ్ఎంలను నియమించాలన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాల్లో 120 మంది విద్యార్థులు దాటితే ప్లస్ 1 ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతుల విలీనం మానుకోవాలన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

చలో విజయవాడను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- నందిగాం

జూన్ 5న అమరావతిలో జరగనున్న రాష్ట్ర కౌన్సిల్ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్.సోమేశ్వరరావు, ఎం.సంతోష్ కుమార్, ఎంపిడిఒ కుమార్ పట్నాయక్ తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు మరమ్మతు పనులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరంలోని రామలక్ష్మణ జంక్షన్ వద్ద గల మర్తిబట్టి ప్రధాన కాలువ మరమ్మతు కారణంగా జిటి రోడ్డు, పెద్దపాడు రహదారిపై రాకపోలకలను నిలిపి వేస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కాలువపై కల్వర్టులో చెత్త పూడుకు పోవడంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని ఆయన వివరించారు. మరమ్మతుతో పాటు శుభ్ర పరచే పనులు పూర్తయ్యేంత వరకు వాహనాలను దారి మళ్లించినట్టు తెలిపారు. పనుల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉండేందుకు, రామలక్ష్మణ్ జంక్షన్ నుంచి పెద్దపాడు వెళ్లే వాహనాలు డగ్లస్ స్కూల్, విశాఖ బి కాలనీ మార్గం ద్వారా దారి మళ్లించినట్టు తెలిపారు. అలాగే జిటి రోడ్డు నుంచి పెద్దపాడు వైపునకు వెళ్లే వాహనాలు సైతం విశాఖ ఎ కాలనీ మార్గంలో వెళ్లవచ్చన్నారు.


సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

సాగునీటి పనుల కల్పనపై సమీక్ష

ప్రజాశక్తి- పొందూరు

ఖరీఫ్ నాటికి రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటి వనరుల పనులు కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎంపిడిఒ మీసాల మన్మధరావు, తహశీల్దార్ టి.వెంకటేష్, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్‌లు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాగునీటి వనరుల పనులపై పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధిహామీ పథకం ద్వారా ఫారంపాండ్లు, చెక్‌డ్యాంలు నిర్మాణాలకు అవసరమైన పనులను గుర్తించి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, ఎఒ బాబ్జీ, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.